సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

నాంపల్లి నియోజకవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు రూ. 5 .10 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ గురువారం అందజేశారు.

– మెహిదీపట్నం ఫిబ్రవరి 22

ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం..

మేడారం అమ్మవార్ల ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్న భక్తులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 22 : ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం లాల్‌దర్వాజ శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ వెంకటేశ్ ద్వారా పంపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఫలక్‌నుమా ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో గురువారం సమ్మక్క, సారలమ్మ ప్రసాదం ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించారు. నేరుగా మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు అమ్మవారి ప్రసాదం కోసం ఆర్టీసీ అధికారులు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఆర్టీసీ కార్గో, ఏజెంట్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు భక్తులకు అందుబాటులో ఉంటారని, భక్తులు ఆన్‌లైన్ విధానంలో ఇచ్చిన ఆడ్రస్‌కు ప్రసాదం పంపిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు ఎం.సుధాకర్, జి. సతీశ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 22: ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. పెండింగ్ పనులు పరిష్కరించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కాచిగూడ నింబోలిఅడ్డాలో గురువారం రూ. 27 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ ఉమాయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నింబోలిఅడ్డా, తదితర బస్తీలలో పర్యటించి స్థానిక ప్రజల నుంచి పలు సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంభంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డునిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు స్థానికులు పర్యవేక్షించినప్పుడే నాణ్యత ఉంటుందని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో స్థానికులను వేధిస్తున్న నీటి కాలుష్య సమస్య పరిష్కారంతోపాటు బస్తీలు, కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎర్ర బీష్మాదేవ్, ఓంప్రకాశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, బి. కృష్ణాగౌడ్, సుభాష్‌పటేల్, మహేశ్‌కుమార్, బబ్లూసింగ్, బబ్బీ, శ్రీకాంత్ యాదవ్, అంటోని, శ్రీకాంత్‌ముదిరాజ్, సతీశ్, సరిత తదితరులు పాల్గొన్నారు.

27న బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశం

పేదల కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశాన్ని ఛే నంబర్‌లోని రాణాప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు సాయి కిరణ్‌యాదవ్ విచ్చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోల్కొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్

మెహిదీపట్నం ఫిబ్రవరి 22 : ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి అభివృద్ధి పనులను కోట్లాది రూపాయలతో చేపడుతున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గంలోని నానల్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ, టోలిచౌకి డివిజన్లలో సుమారు రూ. 9 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌తో కలిసి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలి..

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : బీజేపీ అధికారంలో ఉంటే దేశ సమైఖ్యతకు ప్రమాదమని సీపీఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం)రెండు రోజులు పాటు జరగనున్న రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి.రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నామని, పొత్తు ఉంటుందా?.. లేదా..? అన్నది కాంగ్రెస్ తేల్చాలని చెప్పారు. ఆపార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, చెరుపల్లి సీతారాములు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి

సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి

అబిడ్స్, ఫిబ్రవరి 22 : వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి అన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఎన్‌జీఓల కేంద్ర సంఘం 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆమె యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాఖలోని ఉద్యోగులకు ప్రమోషన్లు, కార్యాలయాలకు కంప్యూటర్‌లు, ఫర్నిచర్ ఇతర సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఎన్‌జీఓల కేంద్ర సంఘం అధ్యక్షుడు రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి , అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రహమత్‌అలీ, అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మధు స్వామి, శ్రీరాం, ముజాహిద్ పాష, రవీంద్రబాబు, కరుణాకర్, రాజు, వివిధ డివిజన్ల, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : బాగ్‌లింగంపల్లిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పద్మ శ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, ప్రముఖ కవులు జెల్దీ విద్యాధర్, వీడీ రాజగోపాల్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తా హరి హాజరై మాట్లాడారు.

వంశీ రామరాజుకు సత్కారం

వంశీ రామరాజును సత్కరించిన మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు

ముషీరాబాద్, ఫిబ్రవరి 22: తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్, అక్షరయాన్ సంస్థల ఆధ్వర్యంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజుకు గురువారం ఓ హోటల్‌లో సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని వంశీ రామరాజును సత్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకురాలు అక్షరయాన్ స్థాపకురాలు, ఇనంపూడి శ్రీలక్ష్మి, అందెశ్రీ, బైస దేవదాసు, సరోజిని, పద్మజ, స్నేహజ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

మెహిదీపట్నం ఫిబ్రవరి 22 :ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడానికి డాక్టర్లు కృషి చేయాలని మల్లెపల్లి డివిజన్ ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ అన్నారు. నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ఆదేశించడంతో జాఫర్‌ఖాన్ నాంపల్లి ఏరియా ఆస్పత్రిలో పర్యటించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు,వారి సహాయకులకు ఇబ్బందులు కలగకుండా ఆస్పత్రి అధికారులు కృషి చేయాలని సూచించారు.

మసీదులు, శ్మశానవాటికల వద్ద ఏర్పాట్లు చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 22: ఈ నెల 25న జరిగే జగ్గీకీ రాత్ సందర్భంగా మసీదులు, శ్మశానవాటికల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ముషీరాబాద్ సర్కిల్–15 డీఎంసీ ఖదీర్ మోహినోద్దీన్‌కు గురువారం బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్లక్ హుస్సేన్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ముషీరాబాద్ డివిజన్ మైనారిటీ కమిటీ అధ్యక్షుడు పర్వేష్ మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టి, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, ఫిబ్రవరి 22 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలో జరుగుతున్న పూడికతీత పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి గురువారం పరిశీలించారు. రాబోవు వర్షాకాలాన్ని పురస్కరించుకొని డివిజన్‌లోని అన్ని నాలాల్లో పూడికను తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, జె.బాల్‌రాజు పాల్గొన్నారు.

విరామం లేకుండా చదివితే గ్రహణ శక్తి తగ్గుతుంది..

● సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సైకాలజిస్ట్ స్హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ, ఫిబ్రవరి 22: ముషీరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ హాజరై మాట్లాడుతూ.. కంప్యూటర్‌లో కీబోర్డు, మౌస్ ఉపయోగించినట్లే పంచేంద్రియాలు, ఊహాశక్తితో మానవ మేధస్సును ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చని అన్నారు. భవిష్యత్తు పట్ల ఆక్షాంక్ష, చదువుపై ఆసక్తి, ఏకాగ్రతను ఏర్పరుస్తుందని, అధిక సమయం విరామం లేకుండా చదివితే మెదడులో ఆక్సీజన్, గ్లూకోజ్ స్థాయిలు తగ్గి గ్రహణ సామర్థ్యం సన్నగిల్లుతుందని చెప్పారు. అందుకే ప్రతి 45 నిమిషాలకు పది నిమిషాలు విరామం ఇచ్చి, పుస్తకం మూసి అప్పటి వరకు చదివిన విషయాలను నెమరువేసుకోవాలని, అనంతరం 7 రోజులకు, 21 రోజులకు, 42 రోజులకు పునఃశ్చరణ చేస్తే శాశ్వతంగా జ్ఞాపకం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్వరూపా రాణి, ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, స్నాక్స్ అందజేశారు.

ఓటరు నమోదు

రాంనగర్ డివిజన్ దాయర మార్కెట్‌లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజస్, శ్రావణ్, రమేశ్‌యాదవ్, ప్రవీణ్‌ముదిరాజ్, వాసుదేవ్, శ్రీనివాస్, సిద్ధా, విక్రమ్, రాజు, రజిని పాల్గొన్నారు.

– ముషీరాబాద్, ఫిబ్రవరి 22

హెల్మెట్ల పంపిణీ

చిన్నారులకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్న నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, బీజేపీ నేత డాక్టర్ గౌతంరావు

అంబర్‌పేట, ఫిబ్రవరి 22 : రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హీరో కార్పొరేషన్, ఇండియన్ హెడ్ ఇంజురీ ఫౌండేషన్ సౌజన్యంతో ఫస్ట్ క్లాస్ నుంచి ఆరో తరగతి చదివే పిల్లలకు గురువారం హెల్మెట్లను పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత హాజరై చిన్నారులకు హెల్మెట్లను అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి ఈ హెల్మెట్లను పంపిణీ చేసినట్లు ఐహెచ్ ఐఎఫ్–హీరో కార్పొరేషన్ ఇన్‌చార్జి అనూరాధ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ దేవదాసు, సంస్థ అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్, కో–ఆర్డినేటర్ శిరీష, కృష్ణ, శ్రీనివాస్, సునీల్, స్వప్న, ప్రశాంతి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 22: నాంపల్లి హజ్‌హౌస్ భవన్‌లో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి సన్మానించి శుభాకంక్షలు తెలిపారు. జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, సభ్యులు బి.శంకర్, ముఖీం ఖురేషి, వక్ఫ్‌బోర్డు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం వర్ధంతి

భారతరత్న మౌలానా అబుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, కార్యదర్శి మణిలాల్ షా గాంధీభవన్‌లో కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

– అబిడ్స్, ఫిబ్రవరి 22

డీసీఎల్‌గా రాజేంద్రప్రసాద్

చిక్కడపల్లి,ఫిబ్రవరి 22 : ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(డీసీఎల్)గా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రప్రసాద్ నల్గొండ జిల్లా నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్యామ్‌సుందర్ జాజు నల్లగొండకు బదిలీ అయ్యారు.

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : చిక్కపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హుండీ లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా దేవాలయ ఈఓ దేవనాథం మాట్లాడుతూ.. నెల రోజులకు గాను రూ. 1,46,743 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నేడు రాజ శ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం

అన్నదాన ప్రసాద వితరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కవాడిగూడ, ఫిబ్రవరి 22: ఎన్టీఆర్ స్టేడియంలో నేడు రాజ శ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వాసవి సేవా సమితి రాంనగర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం గాంధీనగర్, చిక్కడపల్లి, వాసవి సేవా కేంద్రం హైదరాబాద్, వాసవి క్లబ్ సంస్థల సౌజన్యంతో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆ సంస్థల ప్రతినిధులు కసనగట్టు రాజశేఖర్ గుప్త, వాడకట్టు రాజుగుప్త, ఆమ్‌రాది నాగరాజు, అనంతుల ఆంజనేయులు, నీతి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు అన్నదాన ప్రసాద వితరణ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు వారు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగర ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శత రాజ శ్యామల యాగం, 10 నుంచి ఒంటిగంట వరకు శివపార్వతుల కల్యాణం జరగుతుందని తెలిపారు. భక్తులందరికీ ఉచిత ప్రవేశం ఉంటుందని వెల్లడించారు.

సేవాభావంతో వైద్య సేవలందించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 22 : అనారోగ్యంతో దవాఖానకు వచ్చే పేద రోగులకు సేవాభావంతో వైద్య సేవలను అందించాలని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు దవాఖాన కాన్ఫరెన్స్ హాల్‌లో నర్సింగ్ పాఠశాల ప్రిన్సిపాల్ సుశీల ఆధ్వర్యంలో నర్సింగ్ స్కూల్‌లో నూతనంగా చేరిన 52 మంది విద్యార్థినులకు క్యాపింగ్(టోపి) సెర్మనీ, లైటింగ్ ల్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించారు. దవాఖాన అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ బి. త్రివేణి, సీఎన్ అడ్మిన్ ఆర్ఎంవో–1 డాక్టర్ బి. శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సుశీల, గ్రేడ్–1 ఆఫీసర్ సుజాతారాథోడ్ పాల్గొన్నారు.

ఉచిత వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ, ఫిబ్రవరి 22: యువకులు వరకట్నం తీసుకోకుండా వివాహాలు చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని మంగళ్‌పల్లి మహమ్మాయిదేవి ఆలయ ప్రాంగణంలో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9848199744, 924773 7298 నంబర్లలో సంప్రదించాలి.

'మానవ సేవయే మాధవ సేవ'

అంబర్‌పేట, ఫిబ్రవరి 22 : మానవ సేవయే మాధవ సేవ అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రచయిత, ఫిలాసఫర్ ది జాన్ జయ వాహి అన్నారు. బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ శిరిడీ సాయిబాబా సంస్థాన్‌లో 'సాయి మై మెజీషియన్' పై ది జాన్ జయ వాహి ప్రసంగించారు. స్పర్శతో జబ్బులను తగ్గించే ఆమె తన శక్తి అంతా సాయిబాబానే అన్నారు. సంస్థాన్ ప్రతినిధులు మాట్లాడుతూ చిన్న వయసులో లైంగికదాడికి గురైన బాలికలు, సంఘం వెలివేసిన మహిళలను దత్తత తీసుకొని వారికి ఉన్నత విద్యను చదివే అవకాశం కల్పిస్తారని అన్నారు. సంస్థాన్ అధ్యక్షుడు పి. కృష్ణ, కే. సాయిబాబా, కార్యదర్శి పీవీ సాయి, జాయింట్ సెక్రటరీ ఎంఎస్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 : విద్యతో పాటు నైపుణ్యం పెంపొందించుకుంటే న్యూట్రిషన్ విభాగం విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని పలువురు వక్తలు సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల క్లినికల్ న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సైన్స్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూట్రీవిండ్ హెల్త్ కేర్ వ్యవస్థాపకుడు విశాల్ మావూరి, కళాశాల న్యూట్రిషన్ విభాగం అధ్యక్షురాలు బి. అనూష హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు లేకుండా చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్నడీఈ శ్యాంసుందర్‌రెడ్డి, పాల్గొన్న ఏడీలు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 22 : ప్రజలకు వేసవిలో కరెంట్ కష్టాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్ డివిజన్ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మెహిదీపట్నం రేతిబౌలిలో ఉన్న ఆసిఫ్‌నగర్ డీఈ కార్యాలయంలో ఏడీలు, ఏఈలు, సిబ్బందితో డీఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ సరఫరాపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏడీలు వెంకటేశ్వర్లు, మల్లేశ్, నరసింహారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి బీజేపీ విజయ సంకల్పయాత్ర..

సంకల్పయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 22: నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు దేశ వ్యాప్తంగా చేపట్టిన విజయ సంకల్పయాత్ర మార్చి 1న ముషీరాబాద్ నియోకవర్గంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లోని బీజేపీ కార్యాలయంలో పూస రాజు ఆధ్వర్యంలో రూపొందించిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్యాంసుదర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీ రాత్రి ముషీరాబాద్ కాశిష్ ఫంక్షన్‌హాల్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ బసచేస్తారని తెలిపారు. మార్చి1న ఉదయం 8 గంటలకు ముషీరాబాద్ చౌరస్తా నుంచి యాత్ర ప్రారంభమై నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో నిర్వహించి రాంనగర్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావు,అధికార ప్రతినిధి రాంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ నవీన్ గౌడ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.